క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో నేడు (ఆదివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. మిత్రనగర్, డాక్టర్స్ కాలనీ, ప్రణయభాస్కర్ కాలనీ, కేఎస్ఆర్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో డ్రగ్స్ కంట్రోల్ బృందం తనిఖీ



కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో శనివారం డ్రగ్స్ కంట్రోల్ బృందం తనిఖీలు చేపట్టింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణలో తీసుకుంటున్న చర్యల్లో భాగంగా సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాలనుసారం డ్రగ్స్ కంట్రోల్ టీం పోలీస్ జాగిలంతో ముమ్మర తనిఖీ చేపట్టారు. ప్లాట్‌ఫాంలు, ప్రయాణికుల వేచి ఉండు గదులను తనిఖీ చేసి అనుమానాస్పద వ్యక్తులను, బ్యాగులను తనిఖీ చేశారు. అలాగే రైల్వే పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆర్.ఐ.శివకేశవులు పాల్గొన్నారు.

'ఉపాధి'పై డీఆర్డీఓ ఆగ్రహం

- విచారణకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

హసన్‌పర్తి : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై డీఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు విచారణకు ఆదేశించారు. 'ఉపాధిహామీ'లో అక్రమాలు అనే కథనం 'సాక్షి'లో శనివారం ప్రచురితమైంది. ఈ కథనానికి డీఆర్డీఓ మేన శ్రీను స్పందించి సమగ్ర నివేదిక అందించాలని ఎంపీడీఓను ఆదేశించారు.

20న విచారణ

మండలంలోని అన్నాసాగరంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులపై ఈనెల 20న విచారణ జరుపుతున్నట్లు ఎంపీడీఓ కర్ణాకర్ రెడ్డి తెలిపారు. విచారణకు కూలీలు హాజరు కావాలని సూచించారు.

సార్వత్రిక సమ్మెకు సన్నాహాలు కొనసాగించాలి

న్యూశాయంపేట : దేశవ్యాప్తంగా ఉన్న పరిస్థితుల దృష్ట్యా జూలై 9కి వాయిదా పడిన సార్వత్రిక సమ్మె సన్నాహాలను కొనసాగించాలని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కు రాజు అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు సదానందం, ఓదేలు, రాజేందర్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రియరాణికి డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు వై. ప్రియరాణికి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. హ్యూమన్ రిసోర్స్ ప్లానింగ్ అండ్ రిటెన్షన్ స్ట్రాటజీస్ ఇన్ సెలెక్ట్ ఐటీ కంపెనీస్ ఇన్ హైదరాబాద్ ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను ప్రియరాణికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె రాజేందర్ తెలిపారు. ఆవిభాగం ప్రొఫెసర్ (తెలంగాణ యూనివర్సిటీ వీసీ) టి యాదగిరిరావు పర్యవేక్షణలో ప్రియరాణి తన పీహెచ్‌డీ పూర్తి చేసింది.

'మంత్రి సురేఖపై ట్రోల్స్ సరికాదు'

నయీంనగర్ : ప్రపంచ సుందరీమణుల మీటింగ్‌లో మంత్రి కొండా సురేఖ ఇంగ్లిష్‌లో మాట్లాడుతున్న సమయంలో కొంత తడబాటు పడి మాట్లాడినందుకు మంత్రికి ఇంగ్లిష్ రాదని కొంతమంది కావాలని సోషల్ మీడియాలో అవమానించడాన్ని జనతాదళ్ (సెక్యులర్) పార్టీ జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి తీవ్రంగా ఖండించారు. బీసీ ఆడబిడ్డను గౌరవించని సంస్కృతి సంప్రదాయాలు సరైనవేనా అని ఆయన ట్రోల్ చేస్తున్న వారిని ప్రశ్నించారు. మంత్రి సురేఖ దంపతుల కుటుంబం ఎంతో మందికి రాజకీయ జీవితాన్ని ఇచ్చిందనే విషయాన్ని ట్రోల్స్ చేస్తున్న వారు మర్చిపోవద్దన్నారు.

సుప్రీంకోర్టు ప్రధానజడ్జిని కలిసిన బార్ కౌన్సిల్ సభ్యుడు



వరంగల్ లీగల్: న్యూఢిల్లీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ.ఆర్ గవాయిని శనివారం తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు బైరపాక జయాకర్ మర్యాద పూర్వకంగా కలిశారు.

మురికి కూపంగా రోడ్డు



రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ పక్కన ఉన్న రోడ్డు మురికి కూపంగా మారింది. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోంది. ఫలితంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్డుపై మురుగు నీరు చేరడంతో దుర్వాసనతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల కారణంగా రాత్రివేళ కంటి మీద కునుకు కరువైందని వాపోతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ప్రజలు చెబుతున్నారు. ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరుతున్నారు.

వృథాగా తాగునీరు



పైపులైన్ లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

హన్మకొండ : తాగునీరు లీకేజీ ద్వారా వృథాగా పోతున్నా వరంగల్ మహానగర పాలక సంస్థ పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్‌లో తిరుమల బార్ ఎదురుగా నెలల తరబడి పైపు లైన్ లీకేజీ అయి తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది ఈ రోడ్డు మార్గాన ప్రయాణిస్తూ వారి కళ్లకు లీకేజీ కనిపిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు చేయాలని నగర వాసులు కోరారు.

పట్టణ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



కాజీపేట : సోమిడిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

కాజీపేట: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లోనూ వెనుకబడిపోయిన కాజీపేట పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేసి చూపిస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గ్రేటర్ పరిధిలోని 62వ డివిజన్ సోమిడి హనుమాన్ నగర్, యాదవనగర్, ఎస్సీ కాలనీల్లో శనివారం రూ.40 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ సోమిడి ప్రజలు బతుకమ్మ ఆడుకోవడం చక్కటి స్థలం ఉండాలని, చెరువు ఆవరణలో అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, కుమారస్వామి, అశోక్, సాంబయ్య, జయాకర్, లలిత పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటా

కాజీపేట రూరల్ : కాజీపేట ట్రైసిటీ ఆటో యూనియన్ సభ్యులకు అండగా ఉంటానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యేను ట్రైసిటీ ఆటోయూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటో కార్మికులకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకవస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు మైసారపు సిరిల్ లారెన్స్, సలహాదారుడు విజయభాస్కర్, అధ్యక్షుడు గడప శ్రీనివాస్, కోశాధికారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

- వరంగల్ జిల్లా కన్వీనర్ మౌలానా ఫసీయొద్దీన్



రామన్నపేట : సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం మతపెద్దలు

రామన్నపేట : వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వరంగల్ జిల్లా కన్వీనర్ మౌలానా ఫసీయొద్దీన్ ఖాస్మీ, మహమ్మద్ అబ్దుల్ సుభాన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇస్లామియా మైదానంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు ఆమెండ్మెంట్ చట్టానికి వ్యతిరేకంగా నేడు (ఆదివారం) సాయంత్రం 6 గంటలకు నగరంలోని ఇస్లామియా కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారతదేశం అంటేనే భిన్నత్వంలో ఏకత్వం గల దేశం అని. అన్ని మతాల ప్రజలకు రాజ్యాంగ బద్ధమైన హక్కులను సమానంగా అందజేసిన దేశమని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ఈ విషయాన్ని మరిచి ప్రజలను కులాల, మతాల వారీగా విభజిస్తూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. బహిరంగ సభకు ప్రధాన వక్తగా లాబోర్డు జాతీయ అధ్యక్షులు మౌలానా ఖాలీద్ సైపుల్ల రెహమాని, మంత్రి కొండా సురేఖ, ఎంపీ అసుదుద్దీన్ ఓవైసీ, ప్రొఫెసర్ మనోకుమార్, చంద్రశేఖర్, ఆజాద్, ముస్లిం మత పెద్దలు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సయ్యద్ షా అలీ ఖాద్రీ, ఉబేత్‌బాబా, మౌలానా మీర్ ఇద్రీస్ అలీ ఎజాజా బియాబానీ, అబ్దుల్ రహమాన్, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ ఫాసిస్టు విధానాలను అడ్డుకోవాలి

న్యూశాయంపేట : మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలను అడ్డుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు పిలుపునిచ్చారు. వక్ఫ్‌బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా నేడు(ఆదివారం) వరంగల్ ఇస్లామియా కళాశాల మైదానంలో ఆల్ఇండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు ఆధ్వర్యంలో జరిగే సభకు న్యూడెమోక్రసీ మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మార్కెట్‌లో టెండర్ల మాయ

- పోటీకి రాకుండా ముందస్తు ఏర్పాట్లు
- ఆదాయానికి గండికొట్టే యత్నం

వరంగల్ చౌరస్తా : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని పలు దుకాణాలు, క్యాంటిన్ తదితరాల టెండర్లలో కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారారా.. పోటీకి ఎవరూ రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నారా అంటే పరిస్థితులను చూస్తే అవుననే సమాధానం వస్తోంది. వ్యవసాయ మార్కెట్‌లోని మూడు పాన్‌షాపులకుగాను ఇద్దరు, మూడు క్యాంటీన్లకు ఒక్కరు మాత్రమే టెండర్ వేశారు. మూడు చోట్ల టాయిలెట్లుకు ముగ్గురు, మూడు చోట్ల యార్డు క్లీనింగ్(శానిటేషన్)కు ఒక్కరు మాత్రమే టెండర్ వేశారు. ఇక వరంగల్ కూరగాయల మార్కెట్‌లో టాయిలెట్లు 4 షెడ్యూల్స్‌కుగాను నలుగురు, యార్డు క్లినింగ్‌కు 4 షెడ్యూల్స్‌కు గాను 4 టెండర్ దాఖలయ్యాయి. ఏళ్ల తరబడి టెండర్లను దక్కించుకుంటున్న వారే తిరిగి పొందేలా శ్రమించినట్లు సమాచారం. ఈనెల 19న టెండర్లను మార్కెట్ అధికార యంత్రాంగం పరిశీలించి ఖరారు చేసేందుకు సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు ఆదేశాలే శరణ్యంగా టెండర్లను ఖరారు చేస్తారన్న చర్చ బాహాటంగా జరుగుతోంది. ఈ విషయంలో వ్యవసాయ మార్కెట్ అధికారులు ఎలా ముందుకు సాగుతారన్న సందిగ్ధత నెలకొంది.

పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బహుజన్ రాజ్యాధికార పార్టీ మహిళా నాయకులు

హన్మకొండ : హైదరాబాద్‌లో జూన్ 7న జరిగే బహుజన్ రాజ్యాధికార పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు పీసరి రజిత పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో పార్టీ ఆవిర్భావ సభ కరపత్రాలను మహిళా నాయకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సదర్భంగా రజిత మాట్లాడుతూ రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా బహుజన్ రాజ్యాధికార పార్టీ ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మరియ, ఎండీ. సాహిదా, కవిత, స్వప్న, అంజి, రాధ, సంపూర్ణ, వనమ్మ, స్రవంతి, భవ్యశ్రీ, శ్రీలత, మచ్చిక విజయ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఓంకార్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

నయీంనగర్ : అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ జీవితచరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని ఎంసీపీఐ(యూ) పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 12 నుంచి 2026 మే 12 వరకు ఓంకార్ శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పోలీసుల అదుపులో సంఘం నిర్వాహకుడు

ఖిలా వరంగల్: ప్రజలు పొదుపు చేసుకున్న డబ్బులు కాజేసి పరారైన కరుణ పరపతి సంఘం నిర్వాహకుడు తొటం వెంకటయ్యను శనివారం మిల్స్‌కాలనీ పోలీస్ అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. సుమారు 500 మంది సభ్యులు ఉన్న సంఘంలో ఒక్కొక్కరి వాటాధనం రూ.12 వేలకు పైగా ఉన్నట్లు సభ్యులు చెబుతున్నారు. ఇటీవల సభ్యులు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వెంకటయ్యను పోలీసులు తమదైన శైలిలో విచారించి సంఘ లావాదేవీలపై వివరాలు సేకరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

కాజీపేట : కాజీపేట చౌరస్తాలో ఈ నెల 26, 27వ తేదీల్లో జరుగనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మద్దెల ఎల్లేశ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం సభలను విజయవంతం చేయాలని కోరుతూ కార్యకర్తలతో కలిసి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

హసన్‌పర్తి : పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మూలనే కమ్యూనిస్ట్ ఉద్యమ లక్ష్యమని సీపీఐ సీనియర్ నాయకుడు నేదునూరి రాజమౌళి అన్నారు. మండలంలోని వంగపహాడ్‌లో శనివారం సీపీఐ గ్రామసభ నిర్వహించారు. దోమ మధున అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాజమౌళి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత జిల్లా మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు.

గ్రామ కమిటీ ఎన్నిక

సీపీఐ గ్రామశాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మంద జ్యోతి, సహాయ కార్యదర్శిగా దోమ మధునతో సభ్యులను ఎన్నుకున్నారు.

పెరిగిన వేతనం అమలు చేయాలి

వరంగల్ అర్బన్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 మే 1న మున్సిపల్ కార్మికులందరికీ రూ.1000 పెంచుతూ జీఓ నంబర్ 40 రిలీజ్ చేసిందని, కార్మికులందరికీ వర్తింప చేయాలని సీఐటీయూ నాయకుడు టి.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట కార్మికులతో ధర్నా చేసిన అనంతరం కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి వినతి పత్రాన్ని అందచేశారు.

పంటమార్పిడి విధానాన్ని పాటించాలి

హసన్‌పర్తి : పంట మార్పిడి విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్‌కుమార్ అన్నారు. 'రైతుల ముంగిట్లో శాస్త్రవేత్త'లో భాగంగా శనివారం మండలంలోని జయగిరిలో సమావేశం నిర్వహించారు. దిలీప్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. డాక్టర్ విశ్వతేజ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి అవసరమైన ఎరువులు కొనుగోలు చేసిన రశీదును భద్రపరచాలని సూచించారు. జాతీయ రైతు గుర్తింపు కార్డుల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

వాసవి క్లబ్ చేయూత



వరంగల్ చౌరస్తా : వరంగల్ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్, వాసవి క్లబ్ వాసవి క్లబ్ సభ్యుడు వేముల సంతోష్ ఇటీవల అకాల మరణం చెందడంతో ఆయన సతీమణి ప్రవీణకు రూ.3.19 లక్షల చెక్కును అందజేశారు. శనివారం ఆర్ఎస్‌టీ రోడ్డులోని ఆర్యవైశ్య సత్రంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తొనుపునూరి వీరన్న, డిస్ట్రిక్ట్ గవర్నర్ వేమిశెట్టి కిషోర్‌లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేగడి టిప్పర్లతో ట్రాఫిక్ ఇక్కట్లు

మామునూరు : వరంగల్ భద్రకాళి నుంచి గవిచర్ల రోడ్డు మీదుగా నక్కలపల్లి ఇటుక బట్టీలకు తరలిస్తున్న రేగడి మట్టి టిప్పర్లు క్యూలైన్‌గా రావడంతో శనివారం ఒక్కసారిగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇసుక ట్రాక్టర్లు రోడ్డుపై పార్క్ చేసి ఉండటంతో రేగడి టిప్పర్లు బారులు తీరడటంతో ఎండలో వాహన చోదకులు అవస్థలు పడ్డారు. పటిష్ఠ చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు

కాజీపేట : నేరాలను నియంత్రించడానికి సీసీ కెమెరాలు దోహదపడుతాయని స్థానిక సీఐ వై.సుధాకర్‌రెడ్డి అన్నారు. 62వ డివిజన్ సోమిడి శివాలయం జంక్షన్, హనుమాన్ నగర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. నేను సైతం పోలీస్ ప్రోగ్రాంలో భాగంగా కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ 9 సీసీ కెమెరాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సైలు శివకృష్ణ, నవీన్ కుమార్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అధిక రక్తపోటుపై అవగాహన ర్యాలీ

కాజీపేట : మండలంలోని సోమిడి గ్రామ పురవీధుల్లో శనివారం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ డాక్టర్ సత్యేంద్రనాథ్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇక్తాదర్, మీడియా అధికారి వి.అశోక్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర అనిత, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ఖిలా వరంగల్ : వరంగల్–నర్సంపేట రోడ్డు వెంకట్రామ జంక్షన్‌లో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో టాటా ఏస్ వాహనం, అంబులెన్స్, ఆర్టీసీ బస్సు ఒకదానికొకటి ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ విషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. వాహనాలను పక్కకు పెట్టించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ప్రమాదానికి గురైన వాహనాలు, గాయాలైన పలువురి వివరాలు సేకరించినట్లు తెలిసింది.

22న ఆపరేషన్ సిందూర్‌పై వర్చువల్ సమావేశం

వరంగల్ చౌరస్తా : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ని ధైర్య సాహసాలతో విజయవంతం చేసిన భారత సైన్యానికి ధన్యవాదాలు తెలిపేందుకు ఈనెల 22న ప్రధాని మోదీ వర్చువల్ సమావేశానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ కోరారు. శనివారం వరంగల్ హంటర్ రోడ్డు సత్య కన్వెన్షన్ హాల్‌లో సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ తిరంగా యాత్ర కన్వీనర్ రత్నం సతీష్ షా అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వరంగల్ రైల్వేస్టేషన్ ఆవరణలో నిర్వహించే వర్చువల్ సమావేశంలో పాల్గొనాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు శ్రీరాములు, రమేష్, పార్టీ సీనియర్ నేతలు ప్రదీప్‌రావు, సతీష్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు తిరంగా యాత్ర

హన్మకొండ : ఆపరేషన్ సిందూరు విజయం నేపథ్యంలో భారత సైన్యానికి అభినందనలు, ప్రశంసలు తెలుపుతూ ఈ నెల 19న హనుమకొండలో తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ తెలిపారు. యాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీపీని కలిసిన మాజీ ఎమ్మెల్యే రమేశ్

హన్మకొండ : వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు అరూరి రమేశ్ కలిశారు. ఇటీవల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రమేష్ సీపీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అర్ధరాత్రి మొరం దందా

హసన్‌పర్తి: అర్ధరాత్రి చెరువు నుంచి మొరం దందా చేస్తున్న అక్రమార్కులపై అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు మూడు ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేశారు. నాగారం పెద్ద చెరువు నుంచి కొంత మంది అర్ధరాత్రి మొరం దందా చేస్తున్నారని నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం అందింది. స్థానిక పోలీసుల సహకారంతో అధికారులు సంఘనా స్థలాన్ని చేరుకుని మూడు ట్రాక్టర్లు, జేసీబీని అదుపులోకి తీసుకున్నారు. అక్రమార్కులు అక్కడి నుంచి పరారయ్యారు. చెరువు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఏఈ శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సన్మానం



వరంగల్ చౌరస్తా : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వరంగల్ బ్రాంచ్ మేనేజర్ (ఓఎస్‌డీ) పి.అమర్నానాథ్‌రెడ్డి గుజారాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ఎంఎస్‌పీ కో–ఆర్డినేటర్‌గా జనరల్ మేనేజర్ అర్జున్ దవే ముంబై సీసీ హెడ్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. శనివారం వరంగల్‌లోని సీసీఐ కేంద్రంలో బదిలీపై వెళ్తున్న అధికారులను వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, కార్యవర్గం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మడూరి వేద ప్రకాష్, ఉమ్మడి వరంగల్ జిల్లా కాటన్ అసోసియేషన్ అధ్యక్షులు వీరారావు, ప్రధాన కార్యదర్శి నాగభూషణం పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు నిలిపేయాలి

హసన్‌పర్తి : ఎర్రగట్టు గుట్ట దేవస్థానం వద్ద కొంతమంది రియల్టర్లు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఇక్కడ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టారని వివరించారు.